కాలనీల్లో సీసీ రోడ్లు

మియాపూర్, జూలై 2:ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్ రూ.40లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ అధికారులకు సూచించారు. యూజీడీ పూర్తయిన కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన రహదారులను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, వాసు, సంగమేష్, మోజెస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

– ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ విల్లాస్‌లోకి నూతనంగా విచ్చేసిన తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు.

పేదలపై ప్రతాపమే ప్రజా పాలనా ?

ఎంఏ నగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నేత రవికుమార్

మియాపూర్, జూలై 2: ప్రభుత్వ భూమిలో గడిచిన 30 ఏండ్లుగా ఇండ్లు కట్టుకుని నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయాలని హెచ్ఎండీఏ అధికారులు హుకూం జారీ చేయడం హేయమైన చర్య అని భాజపా శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకుడు రవికుమార్ యాదవ్ అన్నారు. పెద్దలను వదిలి పేదలపై ప్రతాపం చూపడమే ప్రజాపాలనా ? అని ప్రశ్నించారు. మియాపూర్ డివిజన్ ఎంఏ నగర్‌లో సర్వే నంబరు 100, 101లలో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్న ప్రజలకు హెచ్ఎండీఏ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన మంగళవారం కాలనీలో పర్యటించారు. ఎంఏనగర్ బస్తీ వాసులకు తాము అండగా ఉంటామని, ఏండ్ల తరబడి ఇక్కడ ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని రవికుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాఘవేంద్రరావు, నాగుల్ గౌడ్, మాన్యం, రవికాంత్, శ్రీను, గౌతం, ప్రవీణ, ప్రకాశ్, వినోద్, అయ్యన్న, లక్ష్మణ్, రాజేశ్, గణేశ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

నిజాంపేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. కార్పొరేషన్ పరిధి 29వ డివిజన్ పంచాయతీ కార్యాలయం నుంచి శ్రీరాంకుంట వెళ్లే వీధిలో గత కొన్నిరోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రోడ్డంతా మురుగుమయంగా దుర్వాసనతో కంపుకొడుతుంది. మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగును నివారించాలని వేడుకుంటున్నారు.

– దుండిగల్, జూలై 2

స్విమ్మింగ్ చేస్తుండగా మూర్ఛతో వ్యక్తి మృతి

సందీప్‌చార్లస్ (ఫైల్)

కుత్బుల్లాపూర్, జూలై2:స్విమ్మింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా ఓ వ్యక్తికి మూర్ఛ(ఫిట్స్) రావడంతో నీటమునిగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ ప్రాంతానికి చెందిన సందీప్ చార్లస్(41) తన భార్య పుష్పకర్మాకర్‌తో పాటు తన కొడుకు విహాన్‌తో కలిసి ఈ నెల 29న కొంపల్లిలోని డోలారిదాన్ సరదాకు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో భోజనం చేసుకున్న తర్వాత సందీప్ చార్లస్, కొడుకు విహాన్‌లు ఇద్దరు కలిసి అందులో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతుండగా సందీప్ చార్లస్‌కు ఒక్కసారిగా మూర్ఛవచ్చి నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న తన భార్య పుష్ప చూసి స్థానిక సిబ్బందికి తెలుపడంతో హుటాహుటిన బయటకు తీసి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సుచిత్రలో ఉన్న ఓ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అభివృద్ధి పనులు వేగవంతం చేయండి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 2:ఆషాడం బోనాల ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అసంపూర్తి పనులను పరిశీలించడంతోపాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాలనీ, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో శంకుస్థాపన చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని, విద్యుత్ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు ప్రాంతాలలో పనిచేస్తున్న ఎంటమాలజీ, పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై త్వరలోనే ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, దోమలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్‌లోని నల్లచెరువు, ఖాజాకుంటల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. వెంటనే చెరువులలో గుర్రపుడెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించి దోమలు నియంత్రించాలన్నారు.

సుందరీకరణ పనులపై దృష్టి సారించాలి

నల్లచెరువు సుందరీకరణ పనులు ఆలస్యంగా సాగుతున్నాయని, ఈ పనులను వేగవంతం చేయాలని, చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు కొలను నిర్మించాలన్నారు. మైత్రీనగర్‌లో కెనెడీ పాఠశాల రోడ్డును బాగుచేయాలని, ఆషాడం బోనాల పండుగకు అమ్మవారి ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బోనాల కోసం చిత్తరమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేయాలన్నారు. డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయా విభాగాల అధికారులను కోరారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇప్పటికే చేపట్టిన పనులన్నింటిని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్‌వో మమత, టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ సోమేశ్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత వసూళ్ల దందా

కేపీహెచ్‌బీ కాలనీలో ప్లాట్‌కు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్

కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న కేపీహెచ్‌బీ కాలనీ ఎల్ఐజీ నిర్మాణదారులు

కేపీహెచ్‌బీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డితో దిగిన ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 2: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేపీహెచ్‌బీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో దిగిన ఫొటోతో 'అనునిత్యం నా ప్రయాణం నీవెంటే అన్నయ్య' అనే కొటేషన్‌తో 'ఇట్లు మీ పీఆర్ నాయుడు' అంటూ పలు చోట్ల ఫ్లెక్సీలు వెలిశాయి. స్థానికంగా ఎవరికి పరిచయం లేని ఆ యువకుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చూసి కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలతో పరిచయాలు ఉన్నాయి, కాలనీలో ఏదైనా సమస్యలుంటే అందరికీ పనికొస్తాడులే అనుకున్నారు స్థానికులు. కానీ..ఆ వ్యక్తి కాంగ్రెస్ పార్టీలోని పెద్దల పేర్లు చెప్పుకుంటూ ఆక్రమ వసూళ్లకు దిగడంతో కాలనీవాసులంతా అవాక్కవుతున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న భవన నిర్మాణాల వద్దకు వెళ్లి నేను కాంగ్రెస్ పార్టీ నాయకుడిని, సీఎం సోదరుడి తాలుకా మనషినని చెప్పడం.. మీరు నిబంధనలు పాటించకుండా ఇంటిని నిర్మిస్తున్నారు.. మీ నిర్మాణం కొనసాగాలంటే అడిగినన్ని డబ్బులు ఇవ్వాలని, స్పందించకుంటే జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పి మీరు కడుతున్న ఇంటిని కూల్చి వేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. కాలనీలో ప్రజల మంచి కోసం పని చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు.. పేదలు నివసించే నిర్మాణాల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. తాజాగా.. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఎల్ఐజీ 121 బ్లాక్‌లో ఆరుగురు ప్లాట్స్ ఓనర్స్ కలిసి పాత ఇంటికి మరమ్మతు పనులు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీఆర్ నాయుడు ఆ నిర్మాణం వద్దకు వెళ్లి ఒక్కో ప్లాట్‌కు రూ.20వేల చొప్పున.. ఆరు ప్లాట్లకు కలిపి లక్షా 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కాలనీ 3వ ఫేజ్‌లో పురాతన కాలంనాటి ఎల్ఐజీ, ఎంఐజీ బ్లాక్‌లు శిథిలావస్థ స్థితికి చేరుకోగా.. జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేసుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారని, కొందరు పేదలు అప్పులు చేసి మరమ్మతులు చేసుకోగా, కాంగ్రెస్ పార్టీ నేతలు వసూళ్లకు దిగడం బాధాకరమని వాపోతున్నారు. కాగా, ఇదే పీఆర్ నాయుడు కాంగ్రెస్ పార్టీ లీడర్‌నంటూ కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ నిర్మాణదారుడిని బెదిరించి లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ నేతలే చెబుతున్నారు. దీంతో పీఆర్ నాయుడిపై కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జికి బాధితులు ఫిర్యాదు చేశారు. పేద ఇండ్ల వద్దకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతల అరాచకాలను సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లేందుకు కాలనీ వాసులు సిద్ధమవుతున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అల్లాపూర్, జూలై 2: అల్లాపూర్, మోతీనగర్ ప్రాంతాల్లో పెండింగ్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్ రమేశ్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ కోరారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో అధికారులతో కలిసి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేశ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎ.బ్లాక్ అధ్యక్షుడు టి.వేణు, రేష్మ, నరసింహ యాదవ్, విట్టల్‌రెడ్డి, మహ్మద్ జమీర్, అబ్దుల్లా, సయ్యద్ బాబు, నజీర్, సుంకన్న, మస్తాన్‌రెడ్డి, అహ్మద్ పాషా, కనకయ్య, వాజీద్ పాషా, భారతమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 2:ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఏపీలోని విజయవాడకు చెందిన కోత భానుశంకర్ వెంకటసాయిరామ్(28) ఉద్యోగం కోసం నగరానికి వచ్చి, కేపీహెచ్‌బీ కాలనీలో స్నేహితులతో కలిసి జీవిస్తూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా... సోమవారం రాత్రి తాను నివసిస్తున్న గదిలోకి వెళ్లిన ఆ యువకుడు ఎంతకు బయటకు రాకపోవడంతో తోటి స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూసేసరికి ఆ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొద్ది కాలంగా ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడని, సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి కృపతో అన్ని పనుల్లో విజయమే

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

బంజారా సేవాలాల్ దుర్గామాత అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ సత్యనారాయణ

శ్రీహనుమత్ ప్రత్యంగిరా కృత్యాతంత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

జీడిమెట్ల, జూలై 2: అమ్మవారిని కొలవడంతో అన్ని పనుల్లో విజయం సాధిస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ విజయ దుర్గా సమేత బంగారు మైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, నిజాంపేట కార్పొరేటర్ ఆగం రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పందిరి యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ ..

కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ సంతోష్‌నగర్‌లోని శ్రీ నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతి పీఠంలో శ్రీనిఖిలేశ్వరానంద స్వామిజీ (డాక్టర్ నారాయణ దత్త శ్రీమాల్) స్వామి వారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వర్గీయ మధుసూదన సరస్వతి వారి కలం రచనలు సుభ్రమణ్యం స్వామిచే నూతనంగా రచించిన శ్రీహనుమత్ ప్రత్యంగిరా కృత్యాతంత్రం పుస్తకాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగుల పాటి కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నిజాంపేట కార్పొరేటర్ ఆగం రాజు, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పందిరి యాదగిరి, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారుడు, సీనియర్ జర్నలిస్టు రమేశ్ సర్వేపల్లి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు

దుండిగల్, జూలై 2: గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్(129) పరిధిలోని నెహ్రూనగర్‌లో మంగళవారం జరిగిన బంజారా సేవాలాల్(జగదాంబమాత) దుర్గామాత అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు ఫిరోజ్, ప్రభుదాస్, తాటి రవికుమార్, దశరథ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను కలిసిన నేతలు, కార్యకర్తలు

దుండిగల్,జూలై 2:దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ వార్డులు/బస్తీల్లో నెలకొన్న సమస్యలను వివరించడంతోపాటు పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన కృష్ణ దుండిగల్ మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి పర్చేందుకు మెరుగైన వసతులతోపాటు ప్రజలకు అవసమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దె లబాల్‌రెడ్డి, కౌన్సిలర్లు భరత్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కామున చెరువులో గుర్రపుడెక్కతో పరేషాన్

గుర్రపుడెక్కతో నిండిన కామున చెరువు

అల్లాపూర్,జూలై 2:అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కామున చెరువు, సున్నంచెరువు, మైసమ్మ చెరువుల నిండా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దుర్వాసనతోపాటు దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్థానిక ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది. చెరువులో ఎప్పటికప్పుడు గుర్రపుడెక్కను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గుర్రపుడెక్క ఏపుగా పెరుగుతుందని వాపోతున్నారు. దోమ గుడ్లను నిర్వీర్యం చేయకపోవడంతోనే దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని కుంటలు,కాలవలు, చెరువులు మురుగునీటి మయంగా మారిపోయాయి. సున్నం చెరువులోకి బోరబండ ప్రాంతం డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో మురికికూపంగా మారింది. చెత్త పేరుకుపోయి దోమలు పెరిగిపోతున్నాయి. ఈ విషయంపై ఎంటమాలజీ ఎస్‌సీ సంధ్యను వివరణ కోరగా, గుర్రపు డెక్క తొలగించడం తమ పరిధిలోకి రాదని, చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కపై దోమలు వృద్ధి చెందకుండా పిచికారి చేయడం, కాలనీల్లో ఫాగింగ్ చేస్తున్నారన్నారు. ఇక గుర్రపు డెక్క తొలగించడం తమ పరిధిలోని రాదని, జీహెచ్ఎంపీ ఇంజినీరింగ్ విభాగం వారికి ప్రదిపాదన పంపామని వివరణ ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగం అధికారిని వివరణ కోరగా, గుర్రపుడెక్క తొలగించడం తమ పరిధిలోకి రాదని, ఎంటమాలజీ విభాగం వారు చూస్తారన్నారని చెప్పారు. అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో చెరువుల్లో భారీగా గుర్రపుడెక్క పోరుకుపోయి దోమలు, దుర్వాస వెదజల్లడంతో స్థానికులకు శాపంగా మారుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కామున చెరువుతోపాటు ఇతర చెరువుల్లో పేరుకుపోయిన గుర్రడెక్కను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దుర్గంచెరువులో చేపల మృతి

కొండాపూర్, జూలై 2 : ఐటీ కారిడార్‌లో పర్యాటకానికి ప్రఖ్యాతిగాంచిన దుర్గంచెరువు కంపుకొడుతున్నది. కలుషిత, హానికారక కెమికల్స్‌తో కూడిన మురుగు నీరు చెరువులో చేరుతుండటంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. కుప్పలుగా చేపలు మృతి చెందడంతో చెరువు దుర్గంధ భరితంగా మారింది. చెరువులో నీరు కలుషితం కావడం, చేపలు మృతి చెంది ఉండడంతో వస్తున్న కంపు వాసనకు పర్యాటకులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. దుర్గంచెరువు వైపు అధికారులు కన్నెత్తిచూడక పోవడంతో సందర్శకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకానికి ఐకానిక్‌కు రూపుదిద్దుకున్న దుర్గంచెరువు మురుగు నీరు చేరుతుండటం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదకరంగా మారుతున్నది.

హెచ్‌సీయూను సందర్శించిన శ్రీలంక జర్నలిస్టుల బృందం

కొండాపూర్, జూలై 2: హైదరాబాద్ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం శ్రీలంకకు చెందిన పలువురు జర్నలిస్టుల బృందం సందర్శించింది. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో నగరంలోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో 'మీడియా మేనేజ్మెంట్ ఫర్ జర్నలిస్ట్స్ అండ్ మీడియా ప్రొఫెషనల్స్' అనే అంశంపై కొనసాగుతున్న రెండు వారాల శిక్షణా కార్యక్రమంలో భాగంగా హాజరైన శ్రీలంక మీడియా ప్రతినిధులు హెచ్‌సీయూలోని సరోజిని నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌ను సందర్శించారు. అక్కడి అధ్యాపకుల నుంచి అత్యాధునిక కమ్యూనికేషన్, మీడియాకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేశ్ నిగమ్‌లను కలిశారు. శ్రీలంక మీడియా బృందంలో శ్రీలంక ప్రధాన మంత్రి సలహాదారు(మీడియా అండ్ అంతర్జాతీయ వ్యవహారాలు) సుగీశ్వర పి.సేనాధిరతోపాటు ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ప్రతినిధి డాక్టర్ కె.సుకుమార్‌లు ఉన్నారు.

సీఎం సహాయ నిధి ద్వారా వినికిడి యంత్రాలు



వినికిడి యంత్ర పరికరాల అమరికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 2: అత్యవసర వైద్య చికిత్సల సమయాల్లో సీఎం సహాయనిధి పేదలకు కొండంత అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం ద్వారా వినికిడి లోపం ఉన్న చిన్నారికి ఆదరువుగా వినికిడి యంత్ర పరికరాలు మంజూరయ్యాయని, వాటి ద్వారా తన సమస్యను అధిగమించేందుకు తోడ్పాటు లభిస్తుందన్నారు. కూకట్‌పల్లి డివిజన్ ఆస్బెస్టాస్ కాలనీకి చెందిన ధనుంజయ్ కుమారుడు కుమార్తె సుబ్రమణ్యేశ్వర్, మన్విత లకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.60లక్షల విలువైన వినికిడి యంత్ర పరికరాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినికిడి యంత్ర పరికరాలు వారి మెరుగైన భవిష్యత్‌కు తోడ్పడుతాయన్నారు. అనారోగ్యం పేదరికం ఏ ఒక్కరికి వైద్య సేవలకు ఆటంకం కాకూడదనే లక్ష్యంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, సువర్ణ, జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరంగాస్ నందనం, శ్రీనిలయం,ఎన్ఆర్ఐ కాలనీ వాసులు మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డిని హిల్‌కౌంటీలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మేయర్ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆయా కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

– దుండిగల్, జూలై 2

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం